క్లుప్తంగా

రేపటి నుంచి ఎమ్మెల్యే పాదయాత్ర

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర చేపట్టనున్నట్లు కార్పొరేటర్ సబిహా బేగం బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు వివిధ కాలనీల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఈ పాదయాత్రలో ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

నియామకం

బాలానగర్: కూకట్‌పల్లి అసెంబ్లీ మహిళా మోర్చా కో-కన్వీనర్‌గా ఫతేనగర్‌కు చెందిన ఉషారాణి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పలువురు ఆమెని అభినందించారు. కార్యక్రమంలో కంచి మహేందర్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న నిర్వాహకులు, ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 1నుంచి 5వ తరగతి చదువుతున్న 1400 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. బుధవారం ఫౌండేషన్ సహ కార్యదర్శి అప్పాటి మాట్లాడుతూ చదువే మీకు రక్ష అన్నారు. చదువును ఎవ్వరూ దొంగిలించలేరని, 15 సంవత్సరాలు బాగా చదువుకుంటే జీవితాంతం సుఖంగా ఉండవచ్చని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. అరుణ, ఉపాధ్యాయులు జయలక్ష్మీ, వై. అరుణ కుమారి,విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నేషనల్ మెగా లోక్ అదాలత్

హఫీజ్‌పేట్: కూకట్‌పల్లి కోర్టులో ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కిరణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కేసుల్లో పట్టుబడిన వారు సంబంధిత పత్రాలతో (డ్రైవింగ్ లైసెన్స్, వాహనం ఆర్సీ, ఆధార్‌కార్డు 3 చొప్పున జిరాక్స్ కాపీలు) ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు. వివరాలకు 9490617330, 8712513147, 8712513148, 9550483016, 8712513149లలో సంప్రదించవచ్చు.

ఖాళీ స్థలంలో పార్కును నిర్మిస్తాం



సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బుధవారం పాదయాత్ర చేశారు. అధికారుల, స్థానికులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీజేఆర్‌నగర్‌లో అమ్మవారి గుడి వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పార్కు నిర్మాణ పనులు చేపడతామమని ఆయన హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు సమ్మారెడ్డి, జాన్, బాలస్వామి, ముజీబ్, మౌలానా, బాబునాయక్, రవీందర్ పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షల రిపోర్టులను అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం తెలంగాణ భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం నిర్వహిస్తున్న సంపూర్ణ ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని పీజేఆర్‌నగర్ కమిటీహాల్‌లో బుధవారం ఏర్పాటు చేశారు. నిర్మాణ రంగ కార్మికులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని నిర్మాణ రంగ కార్మికులకు వైద్య పరీక్షల రిపోర్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జాన్, వాసుదేవరావు, పోశెట్టిగౌడ్, బాలస్వామి, ముజీబ్, మౌలానా, బాబునాయక్, రవీందర్, సాయిగౌడ్, దేవి, వెంకటలక్ష్మీ, రేణుక, సురేఖ పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు



చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద నిర్మించిన వీధి వ్యాపారులు సముదాయం



చందానగర్ మంజీరా రోడ్డుపై ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు

- నిరుపయోగంగా వీధి వ్యాపారుల సముదాయం
- వీధి వ్యాపారుల తరలింపులో అధికారుల నిర్లక్ష్యం
- తప్పని ట్రాఫిక్ తిప్పలు

హఫీజ్‌పేట్: చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద లక్షల రూపాయాలతో నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయం నిరుపయోగంగా మారింది. జీహెచ్ఎంసీ అధికారులు హడావుడిగా స్ట్రీట్ వెండర్స్ కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించి రూ.90 లక్షల నిధులతో సముదాయం నిర్మించి, పండ్లు, కూరగాయాల బొమ్మల గీయించి, నెంబర్లు రాశారు. కానీ ఇప్పుడు దానిని పట్టించుకునే వారే కరువయ్యారు. రోడ్లపై వీధి వ్యాపారులు మంజీరా రోడ్డు ఇరువైపుల ఇష్టానుసారంగా పండ్లు, కూరగాయాల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వాహనదారులకు తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీధి వ్యాపారులకు సముదాయంలో దుకాణాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

- చందానగర్ బీఆర్ గ్యాస్ కంపెనీ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న మంజీరా రోడ్డులో ఇరువైపుల పండ్లు, కూరగాయల దుకాణాల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది.
- జీహెచ్ఎంసీ అధికారులు చిరు వ్యాపారులకు సముదాయాలలో దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.
- సముదాయాలలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పెరిగి, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్న వారిపై పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలి.
- రోడ్డుపై భిక్షాటన చేసే వారికి వీధి వ్యాపారులు సముదాయం అడ్డగా మారింది.
- అధికారులు పక్క ప్రణాళికలు లేకుండా, అనువైన స్థలాన్ని నిర్మించారని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.
- వారాంతపు సంతలతో వీధి వ్యాపారుల సముదాయాలకు వ్యాపారులు రావడానికి ఆలోచిస్తున్నారు.
- హుడా కాలనీలో ఐదేళ్ల క్రితం నిర్మించిన మోడల్ మార్కెట్‌లో వీధి వ్యాపారులకు కేటాయించకపోవడంతో అవి కూడా నిరుపయోగంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- జీహెచ్ఎంసీ, పోలీస్ అధికారులు కలిసి రోడ్డుపై ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తరలింపు చేయాలి.

సముదాయాల తరలింపులో అధికారులదే నిర్లక్ష్యం..



చందానగర్ రైలేస్టేషన్ వద్ద నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయంలో దుకాణాలు కేటాయించడంలో జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం ఉంది. ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు రోడ్డుపై ఏర్పాటు చేస్తున్న స్ట్రీట్ వెండర్లను సముదాయాలకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.
– అనంత్, పాపిరెడ్డి కాలనీ

రాత్రి సమయాల్లో తాగుబోతులకు అడ్డాగా..

వీధి వ్యాపారుల సముదాయం నిర్మాణం పూర్తి అయ్యి నెలలు గడుస్తున్నా ఒక దుకాణాం కూడా వ్యాపారులకు కేటాయించకపోవడం బాధాకరం. రాత్రి అయితే చాలు సముదాయంలో తాగుబోతులకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో వీధి వ్యాపారులు సముదాయం వైపు పెట్రోలింగ్ చేయాలి.
– శంకర్, హుడాకాలనీ

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరాం



బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 50 మంది కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, రాంబాబు నాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్, కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరామని తెలిపారు.

మహిళలకు ఆర్టీసీ రాఖీ బహుమతి

మహిళల కోసం ప్రత్యేక బస్సులు

మూసాపేట: రాఖీ పౌర్ణిమ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని కూకట్‌పల్లి డిపో మేనేజర్ మహ్మద్ ఇసాక్ తెలిపారు. గురువారం రాఖీలు కట్టేందుకు వెళ్లే మహిళలకు లక్కీ డీప్ తీసి బహుమతులు అందజేస్తామన్నారు. మహిళలు తమ స్టాప్‌లో దిగిన తరువాత బస్‌స్టాప్‌లో ఏర్పాటు చేసిన లక్కీ డీప్ బాక్స్‌లో టికెట్ వెనకాల పేరు, ఊరు, ఫోన్‌నంబర్ రాసి వేయాలని కోరారు. డ్రా తీసి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



కూకట్‌పల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు కుమార్‌యాదవ్, కమలాకర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: సర్వే నం.57 ప్రభుత్వ భూముల సమస్యపై ఆల్విన్‌కాలనీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్ బుధవారం కూకట్‌పల్లి ఎంఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ మాట్లాడుతూ... శంషీగూడ ప్రాంతంలో ఉన్న సర్వే నం.57 భూములు ముమ్మాటికి ప్రభుత్వ భూములేనని అన్నారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా ఇచ్చిందన్నారు. వారి అనుచరులతో వచ్చి 57 భూముల చుట్టూ కంచెలు వేస్తున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకొని కంచెలు తొలగించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

- అదే విధంగా సర్వే నం.336 ప్రభుత్వ భూములు కూడా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఆ భూముల్లో బోర్డులు పెట్టారని వాటిని కూడా వెంటనే తొలగించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ విచారణ చేపడతామని చెప్పారని తెలిపారు. ఈ ప్రభుత్వ భూములను కాపాడి ప్రభుత్వ ఆసుపత్రి, క్రీడాప్రాంగణం, మహిళా భవనం వంటివి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డి, రామరాజు, విజిత్, రాంరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయానికి భూమిపూజ

బాలానగర్: డివిజన్ పరిధిలోని జేపీఆర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సాయిబాబా ఆలయానికి బుధవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రముఖ వేదపండితుల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణ పనుల్లో సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆలయాలను సందర్శిస్తే ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆలయాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కాలనీ అధ్యక్షుడు పవిత్రం, కార్యదర్శి మొహమ్మద్ జాబేర్, సభ్యులు కిశోర్, కాలనీఫౌండర్ జయప్రకాష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్ఎస్‌సీ ఆస్పత్రి చైర్మన్ రమేష్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికైన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని బుధవారం ఆర్ఎస్‌సీ ఆస్పత్రి చైర్మన్ రమేష్, పాపిరెడ్డినగర్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రి వైద్యులు గోపి, పవన్‌కుమార్, హెచ్ఆర్ శ్రీనివాస్, మొగుళ్ల కనకారెడ్డి పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధి పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ నేతాజీకాలనీ కమ్యూనిటీహాల్‌లో బుధవారం కార్పొరేటర్ సతీష్‌గౌడ్ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో కాలనీల వారీగా సమీక్షా సమావేశాలను నిర్వహించి ఆయా ప్రాంతాల్లో ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, జరగాల్సిన పనులపై కార్పొరేటర్ ఆరా తీశారు. ఇప్పటికే డివిజన్‌లో 90శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. ఇతర అభివృద్ధి పనులను తప్పనిసరిగా యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. అనంతరం సంక్షేమంపై హర్షం వ్యక్తం చేస్తూ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానికులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు, కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, రాజ్‌కుమార్, కంచి స్వామి, కంచి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేయాలి



మూసాపేట: వివేక్‌నగర్‌లో చేపట్టిన కమిటీహాల్ పనులను బుధవారం మాజీ కార్పొరేటర్ బాబూరావు, ఏఈ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వివేక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దూగూరి ప్రకాష్, కాలనీ కార్యదర్శి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మూసాపేట హనుమాన్ చౌక్ వద్ద ప్రభుత్వ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ బుధవారం ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రెండు గంటల్లోనే దాదాపు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. ఎలాంటి జబ్బునైనా నయం చేసే శక్తి ఆయుర్వేదంకు ఉందని కార్పొరేటర్ అన్నారు. ఈ ఆయుర్వేద మందులతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. డివిజన్‌లో మరిన్ని ఆయుర్వేద వైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మనోహర్, ఇన్‌చార్జ్ వినోద్‌కుమార్, మల్లేష్‌గౌడ్, డాకయ్య, వినోద్‌కుమార్, శివరాజ్, కిషోర్ వెంకట్, యోగేష్, మైసయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రజలకు అందేలా చూడాలి

మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు



రాజీవ్‌గాంధీనగర్‌లో అమ్రేష్‌రాజు నివాసంలో తేనీటి విందుకు హాజరైన మురళీధర్‌రావు

మోతీనగర్: ఏ కార్యక్రమమైనా భక్తితో, ప్రేమతో చేపడితే విజయం సాధిస్తామని మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి అమ్రేష్ రాజు నివాసంలో బుధవారం తేనీటి విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ... ప్రతి కార్యకర్త సామాజికంగా, రాజకీయంగా, ఆధ్యాత్మికంగా తనకు తాను దినదినాభివృద్ధి చెందుతూ నలుగురికి ఆదర్శంగా ఉండాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో దేశంలో ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉంటున్నారని తెలిపారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి దాడులకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను బకెట్ క్లీనింగ్‌తో పరిష్కరించాలి



సెవన్‌హిల్స్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సెవెన్‌హిల్స్‌లో తలెత్తిన డ్రైనేజీ సమస్యను అధికారులు, కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు సమస్యను పరిశీలించానన్నారు. సమస్యను బకెట్ క్లీనింగ్ ద్వారా చేపట్టాలన్నారు. మ్యాన్‌హోల్ నుంచి ప్రతి మ్యాన్‌హోల్ వరకు బకెట్ క్లీనింగ్ ద్వారా పేరుకుపోయిన పూడికను తీయాలని సూచించారు. చెత్తాచెదారం తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలన్నారు. ఎక్కడ డ్రైనేజీ సమస్య ఉందో.. నిత్యం డ్రైనేజీ పొంగుతుందో గమనించి మొదటి ప్రాధాన్యతగా బకెట్ క్లీనింగ్ చేపట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జలమండలి అధికారులకు తెలియజేశామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రశాంతి, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, హైదర్‌నగర్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు కేఆర్‌కే రాజు, శ్రీహరి, కొడాలి రవి, లక్ష్మణ్, యూనిస్, లక్ష్మి, ప్రసాద్, రాజుసాగర్, కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బకెట్ క్లీనింగ్ యంత్రం ప్రారంభం



ఎస్సీబస్తీలో బకెట్ క్లీనింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో డ్రైనేజీలను శుభ్రం చేసేందుకు బకెట్ క్లీనింగ్ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని ఎస్సీ బస్తీలో ఏర్పాటు చేసిన బకెట్ క్లీనింగ్ యంత్రాన్ని ఆయన నాయకులతో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ యాంత్రంతో కాలువల్లోని వ్యర్థాలను తొలగించడం సులువని అన్నారు. డివిజన్‌లో మరిన్ని ఈ యంత్రాలను అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, సూపర్‌వైజర్ ఓంప్రకాశ్, నాయకులు సయ్యద్ ఏజాజ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, రాజుగౌడ్, మట్టి శ్రీను, లలితా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రాఖీ వేడుకలు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల పాఠశాలలో బుధవారం ఓం శాంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు పనికి రాని వస్తువులతో ఆకర్షణీయమైన రాఖీలను తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ పండుగ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. వేడుకల్లో ప్రధానోపాధ్యాయురాలు డి.అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాఖీలు కట్టించుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులు తయారు చేసిన రాఖీలు

ప్రజా సమస్యలపై బీజేపీ పాదయాత్ర



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గజ్జెల యోగానంద్, నాయకులు

ఆల్విన్‌కాలనీ: ప్రజా సమస్యలపై పాదయాత్రలో భాగంగా వెంకటేశ్వరనగర్‌లో బుధవారం రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు గజ్జెల యోగానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం సిలిండర్‌పై రూ.200, ఉజ్వల లబ్ధిదారులకు రూ.400 రాయితీ ప్రకటించిన సందర్భంగా మోదీ చిత్రపటానికి స్థానికులతో కలిసి పాలాభిషేకం చేశారు. రక్షాబంధన్ సందర్భంగా ప్రధాని మోదీ మహిళలకు ఈ రాయితీని కానుకగా ఇచ్చారని ఆయన అన్నారు. ప్రజలు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని.. కేంద్రంలో మోదీ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు విద్యాకల్పన, ఏకాంత్ గౌడ్, శ్రీహరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో 90శాతం పనులు పూర్తిచేశాం

పాదయాత్రలో ఎమ్మెల్యే కృష్ణారావు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

మూసాపేట: వారం రోజులుగా మూసాపేట డివిజన్‌లో పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో 90శాతం పనులు పూర్తి చేశామని ఆయన తెలిపారు. కొన్ని బస్తీల్లో మంచినీటి సమస్యలు ఉన్నట్లు గుర్తించానన్నారు. నెలరోజుల్లో నూతన పైపులైన్లు వేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ కార్పొరేటర్‌గా గెలిచిన వ్యక్తి ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎంపీ రేవంత్‌రెడ్డి మూసాపేట డివిజన్‌లో ఏనాడు పర్యటించలేదని పేర్కొన్నారు. డివిజన్‌లో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు నీరాజనం పలుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే